ప్రభుత్వ పథకాలే కాంగ్రెస్ విజయానికి సోపానాలు

● రాష్ట్ర మంత్రి డా.సీతక్క

బోరబండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి సోపానాలని రాష్ట్ర మంత్రి డా.సీతక్క తెలిపారు. బోరబండ డివిజన్ బలహీనవర్గాల కాలనీ, అన్నానగర్, పెద్దమ్మ నగర్ బస్తీల్లో కాంగ్రెస్ అభ్యర్థి వి.నవీన్ యాదవ్ విజయం కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి అభివృద్ధి, సంక్షేమ పథకాలతో కూడిన కరపత్రాలు పంచుతూ మంగళవారం ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే జూబ్లీహిల్స్ జెట్ వేగంతో అభివృద్ధి సాధిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేషన్ల ఛైర్మన్లు బండ్రు శోభారాణి, మువ్వా విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ బోరబండ డివిజన్ అధ్యక్షుడు బి.అశోక్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు హబీబా సుల్తానా, కె.మహేష్ కుమార్ గౌడ్, కిరణ్‌గౌడ్, రంగా నాయక్ పాల్గొన్నారు.



బోరబండ బలహీనవర్గాల కాలనీలో జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం కోసం ప్రచారం చేస్తున్న రాష్ట్ర మంత్రి డా.సీతక్క



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్

బీఆర్ఎస్ హయాంలోనే వైట్ కాలర్ నేరస్థుల తయారీ

అధికారం కోల్పోయినా బీఆర్ఎస్ నాయకులకు బుద్ధి రావడం లేదని వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి విమర్శించారు. ఉద్యమకారుడు బోడ డిన్న, మహిళా కాంగ్రెస్ నాయకురాలు హబీబా సుల్తానాతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలోనే వైట్ కాలర్ నేరస్థులు తయారయ్యారని ఆరోపించారు. ప్రచారంలో భాగంగా ప్రత్యర్థులను బీఆర్ఎస్ నాయకులు రౌడీలు, గూండాలు అని సంబోధించడం సమంజసం కాదని పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాలే శ్రీరామరక్ష : నవీన్‌యాదవ్

ప్రభుత్వ పథకాలే ప్రజలకు శ్రీరామరక్ష అని కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ అన్నారు. రహ్మత్‌నగర్ డివిజన్‌లోని కార్మికనగర్, ఎస్పీఆర్ హిల్స్ తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతో కలిసి ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నవీన్‌యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులే తన విజయానికి పునాదులుగా మారుతాయన్నారు. ఉప ఎన్నికకు ముందే నియోజకవర్గంలో రూ.150 కోట్లతో అభివృద్ధి పనులు చేపటినట్టు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు భవానీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ల గురించి కేటీఆర్ మాట్లాడడం హాస్యాస్పదం

● టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్

బంజారాహిల్స్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధికారంలో ఉన్నపుడు విమానాల్లో విహరించిన మాజీ మంత్రి కేటీఆర్ అధికారం పోగానే ఆటోలో తిరుగుతూ వారి సమస్యల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్ అన్నారు. ప్రచారంలో భాగంగా రహ్మత్ నగర్‌లో మంగళవారం ఆయన పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంక్షేమ పథకాలను సక్సెస్ ఫుల్‌గా అమలు చేస్తుంటే, చూసి ఓర్వలేని ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సంఘ సేవకులు పీటర్ పాల్, మౌనిక, శ్యామ్, బండి జగదీశ్ పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్

కాంగ్రెస్ అభ్యర్థికి సంపూర్ణ మద్దతు

పంజాగుట్ట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అభ్యర్థి వి.నవీన్ యాదవ్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సుంకరబోయిన మహేష్ ముదిరాజ్ ప్రకటించారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్ సామాజిక వర్గాన్ని వెంటనే బీసీ-ఏ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం బీసీల హక్కుల సాధన కోసం ఏర్పాటు చేసిన బీసీ సంక్షేమ సమితి లోగోను ఆవిష్కరించారు. సమావేశంలో వెనకబడిన కులాల సమాఖ్య(బీసీఎఫ్) అధ్యక్షుడు చెన్న రాములు ముదిరాజ్, సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేశబోయిన శేఖర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి రంజిత్ ముదిరాజ్, మహిళా విభాగం అధ్యక్షురాలు సీతామహాలక్ష్మి, మాణిక్యారావు ముదిరాజ్, రవి ముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్, ఆంజనేయులు ముదిరాజ్, గణేశ్ ముదిరాజ్ పాల్గొన్నారు. నవీన్ యాదవ్‌ను గెలిపించుకుంటామని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సంఘం నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. త్వరలో అన్ని బీసీ సంఘాలను కలుపుకుని భారీ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. ఆయనపై దుష్ప్రచారం ఆపకపోతే ఆయా పార్టీల కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర శ్రీహరిగౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్గని శ్యామల ముదిరాజ్, జి.భిక్షపతి, కె. మల్లేష్ యాదవ్, ఎర్రం సంజీవ, సరిత, జ్యోతి గౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

వెంగళరావునగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం వెంగళరావునగర్ డివిజన్ యాదగిరినగర్‌లో ఆయన ప్రచారం చేశారు. ఆయన వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు గోపాల్, మనోజ్, డీసీసీబీ ఛైర్మన్ సత్తయ్య, తాండూరు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



యాదగిరి నగర్‌లో ప్రచారం చేస్తున్న తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

సీఎం సభకు తరలిన సినీ కార్మికులు

బంజారాహిల్స్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సినీ కార్మికుల అభినందన సభకు కృష్ణానగర్, ఇందిరానగర్‌లోని 24 క్రాఫ్ట్ యూనియన్‌లకు చెందిన కార్మికులు యూసుఫ్‌గూడలోని సభా ప్రాంగణానికి తరలి వెళ్లారు. సీఎం రాక ముందు ఆర్టిస్టులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సినీ పరిశ్రమకు చెందిన వారు వేదికపైకి వచ్చినప్పుడు కార్మికులు నినాదాలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి రాకతో కార్మికుల్లో ఉత్సాహం నెలకొంది. ఆయన వరాలు కురిపించడంతో హర్షధ్వానులతో సందడి చేశారు. ముఖ్యంగా కార్మికుల పిల్లల కోసం కార్పొరేట్ స్థాయిలో పాఠశాల, ప్రతీ ఒక్కరికి ఇళ్ల అంశం పరిశీలిస్తా అని సీఎం ప్రకటించగానే కార్మికుల్లో ఉత్సాహం నెలకొంది. రేవంత్‌రెడ్డి జిందాబాద్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఆయనతో ఫొటోలు దిగేందుకు పోటీపడ్డారు.

ఆమ్ ఆద్మీ పార్టీ నిరసన

చిత్రపురికాలనీలో జరుగుతున్న అవకతవకలపై చర్యలు తీసుకోవాలంటూ ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన కొంతమంది కార్యకర్తలు సీఎం సభలో నిరసన గళం విప్పారు. ప్ల కార్డులు ప్రదర్శించారు. చిత్రపురికాలనీలో అవినీతికి పాల్పడ్డ వల్లభనేని అనిల్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదంటూ ప్రశ్నించారు. అక్కడే ఉన్న పోలీసులు వారిని నిలువరించారు.



సభా ప్రాంగణంలో ఆందోళన చేస్తున్న ఆప్ కార్యకర్తలు

బీఆర్ఎస్, కాంగ్రెస్‌ను బొంద పెట్టాలి



ముస్లిం మహిళను ఓటు అడుగుతున్న ఎంపీ ఈటల రాజేందర్

● ఎంపీ ఈటల రాజేందర్

యూసుఫ్‌గూడ/వెంగళరావునగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను బొంద పెట్టాలని ఎంపీ ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. దేశం సురక్షితంగానూ, సుభిక్షంగానూ ఉండాలంటే మోదీ ప్రధానిగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. కృష్ణానగర్ ఏ, బీ బ్లాక్‌లలో బీజేపీ అభ్యర్థి లంకాల దీపక్‌రెడ్డి గెలుపును కాంక్షిస్తూ మంగళవారం ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం కావాలంటే బీజేపీకి ఓటు వేయాలన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు సోప్‌టాప్ గాళ్లని, వాళ్ల మీద ప్రజలకు విశ్వాసం లేదని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఉపఎన్నికలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు బుద్ధి చెప్పాలని బీజేపీ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య పిలుపునిచ్చారు. బీజేపీ అభ్యర్థి లంకాల దీపక్‌రెడ్డికి మద్దతుగా వెంగళరావునగర్ డివిజన్‌లోని ఏజీ కాలనీ, లక్ష్మీనగర్ తదితర ప్రాంతాల్లో ఆయన ప్రచారం చేశారు. పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ, గడిచిన రెండు సంవత్సరాలుగా రాష్ట్రాన్ని పాలిస్తున్న కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. వెంగళరావునగర్ కాలనీలో మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, జవహర్ నగర్‌లో బండారు విజయలక్ష్మి పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ఎస్.రామచంద్రారెడ్డి, జయశ్రీ, స్థానిక నాయకులు నవీన్, సుప్రియాగౌడ్, శివ, శ్రీకాంత్, సురేష్, కిట్టు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలు అట్టర్ ఫ్లాప్ : డీకే అరుణ

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అట్టర్ ఫ్లాప్.. దమ్ముంటే జనాల్లోకి రావాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ సవాల్ విసిరారు. మంగళవారం జవహర్‌నగర్‌లో ఆమె బీజేపీ అభ్యర్థి దీపక్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ప్రజలు ఆలోచించి ఓటేయాలని కోరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు కాలం చెల్లినట్లేనన్నారు. పదేళ్లు అధికారం ఇస్తే బీఆర్ఎస్ చేసిందేమీ లేదని, ఇక ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకోవడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు. జూబ్లీహిల్స్ వైపే తెలంగాణ మొత్తం చూస్తోందని పేర్కొన్నారు.



వెంగళరావునగర్‌లో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్



మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు తండ్రి సత్యనారాయణ పార్థీవదేహానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత

● యూసుఫ్‌గూడ, ఆంధ్రజ్యోతి

సీఎం బలపరిచిన అభ్యర్థిని ఓడించాలి

బోరబండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో సీఎం రేవంత్‌రెడ్డి బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ని చిత్తుగా ఓడించాలని జూబ్లీహిల్స్ మాల సంఘాల జేఏసీ అభ్యర్థి బేర బాలకిషన్ కోరారు. రహ్మత్ నగర్ డివిజన్ పరిధిలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని 40 లక్షల మంది మాలలకు ఉద్యోగాలు, ఉన్నత విద్య లభించకుండా కేవలం 5శాతం రిజర్వేషన్ కల్పించారని విమర్శించారు. అనుభవం, అవగాహన లేకుండా మాల జాతికి సీఎం రేవంత్‌రెడ్డి తీరని అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ ఛైర్మన్ డాక్టర్ మందాల భాస్కర్, ఛైర్మన్ చెరుకు రామచందర్, వర్కింగ్ ఛైర్మన్ మంత్రి నర్సింహ్మయ్య, విద్యార్థి జేఏసీ అధ్యక్షుడు మాదాసు రాహుల్ రావు, భాస్కర్, డాక్టర్ మల్లేష్, కొప్పుల అర్జున్, శ్రీకాంత్, స్వామి పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న బాలకిషన్

కాంగ్రెస్‌కు ప్రజారాజ్యం పార్టీ మద్దతు

బర్కత్‌పుర, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు ప్రజారాజ్యం పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జిలుకర రవికుమార్ తెలిపారు. బహుజన బిడ్డ నవీన్‌యాదవ్‌ను భారీ మెజారిటీతో గెలిపించి బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ప్రజలు చిత్తుగా ఓడించాలని కోరారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో పార్టీ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. విశ్రాంత ఐఏఎస్ కూనపురెడ్డి హరిప్రసాద్, ప్రముఖ వైద్యులు డాక్టర్ సింగం శ్రీనివాసరావుతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రజారాజ్యం పార్టీని ఆదరించండి, అవినీతిలేని తెలంగాణను నిర్మించుకోవాలనే నినాదంతో పల్లెపల్లెకు వెళ్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సు రేష్, విజయారెడ్డి, ఉదయ్‌సింగ్, ప్రొఫెసర్ జలాలుద్దీన్, మేకల సారయ్య, రత్నరాజు, జెన్ను ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆటిజంను అడ్డుకోవాలి

అమీర్‌పేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆటిజం పిల్లల జీవితంలోకి ప్రవేశించకముందే దాన్ని అడ్డుకోవాలని రెస్‌పైస్ ఆటిజం ఇనిస్టిట్యూట్ ఛైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఆటిస్టిక్ సమస్య ఎదుర్కొంటున్న బాలల్లో గట్- బ్రెయిన్ యాక్సిస్‌ను పరిష్కరించే ఒక ప్రధాన చికిత్స ఫీకల్ మైక్రోబయోటా ట్రాన్స్‌ప్లాంటేషన్ థెరపీని అందించే భారతదేశంలోనే మొట్టమొదటి సంస్థ రెస్‌పైస్ ఆటిజం రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఉచిత అసెస్‌మెంట్ క్యాంపును నిర్వహిస్తోందని ఆయన తెలిపారు. మంగళవారం అమీర్‌పేటలోని హోటల్ ఆదిత్య పార్కులో ఆయన విలేకరులతో మాట్లాడారు. 4-5 దశాబ్దాలుగా పెరుగుతున్న ఆటిజం కేసుల సంఖ్య ఆందోళన కలిగిస్తోందని, దీనికి కారణాలను గుర్తించే దిశలో చికిత్సలపై పరిశోధనలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. సమావేశంలో డాక్టర్ మారేపల్లి కళరమ్య, మాక్సిఫేసియల్ సర్జన్ మహవీర్, డాక్టర్ మురళీమోహన్‌రెడ్డి, ఎథిక్స్ కమిటీ సభ్యులు, రైస్‌పైస్ ఆటిజం రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సభ్యులు పాల్గొన్నారు.

33 మొబైల్ ఫోన్లు స్వాధీనం

పంజాగుట్ట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో గత మూడు నెలల్లో పోగొట్టుకున్న, దొంగిలించబడిన 33 మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకుని మంగళవారం బాధితులకు అందజేశారు. పోగొట్టుకున్న, దొంగిలించబడిన మొబైల్ ఫోన్లను గుర్తించడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామని డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ సైదులు తెలిపారు.

ఎర్రమంజిల్-నవీన్‌నగర్ కాలనీ రహదారిని తెరిపించాలి

పంజాగుట్ట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎర్రమంజిల్ కాలనీ క్వార్టర్స్ నుంచి నవీన్‌నగర్ కాలనీకి వెళ్లడానికి గతంలో రహదారి ఉండేది. కాలనీలోని క్వార్టర్స్ కూల్చివేసి ఆ స్థలాన్ని నిమ్స్ ఆస్పత్రి అభివృద్ధికి కేటాయించారు. నిమ్స్ వెనకాల ఉన్న ప్రభుత్వ పాఠశాలకు చెందిన స్థలాన్ని నిమ్స్ కోసం తీసుకోవడంతో ప్రత్యామ్నాయంగా ఎర్రమంజిల్ నుంచి నవీన్‌నగర్ వెళ్లే మార్గంలో స్థలాన్ని కేటాయించారు. ఈ స్థలంలో ప్రభుత్వ పాఠశాల భవనాన్ని నిర్మించి ఇటీవలే ప్రారంభించారు. పాఠశాల భవనం నిర్మిస్తున్న క్రమంలో రహదారిని కూడా మూసి వేశారు. దీంతో నవీన్‌నగర్ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన రహదారిని కూడా మూసివేస్తున్నారు. దీంతో స్థానికులు కార్పొరేటర్ విజయారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆమె మంగళవారం నవీన్‌నగర్ కాలనీలో పర్యటించారు. సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



సీతారాంపురంలోని శివాలయంలో కార్తీకమాసం ప్రత్యేక పూజలో పాల్గొన్న జంపన్న ప్రతాప్, పాండు యాదవ్

సీతారాంపురంలో కార్తీకమాస పూజలు

బోయినపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం పురస్కరించుకుని కంటోన్మెంట్ ఆరవ వార్డు పరిధిలోని బోయినపల్లి సీతారాంపురం శివపంచాయతన హనుమాన్ ఆలయంలో పూజలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, ఆరవ వార్డు మాజీ సభ్యుడు పాండు యాదవ్ ఆయన సతీమణి విద్యావతిలు పాల్గొని ఆకాశదీపం వెలిగించి అనంతరం ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా యాదవ్, విజయ్ కుమార్, మనోహర్, శ్రీకాంత్ రెడ్డి, ప్రకాష్, భక్తులు పాల్గొన్నారు.



దక్షిణామూర్తి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో కుబేర దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠ

బౌద్ధనగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాస్‌నగర్ శ్రీగిరి పద్మావతి గోదా సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో కుబేర దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జీర్ణోద్ధరణ పూర్వక మహా సంప్రోక్షణ మహాకుంభాభిషేకంలో భాగంగా నాలుగో రోజైన మంగళవారం వేదపండితుల నేతృత్వంలో సీతారామచంద్రస్వామి అభిషేకం, కుబేర దక్షిణామూర్తి, పరివారమైన గణపతి, శివలింగ, స్కందమాత, నందీశ్వర, నవగ్రహ దేవతల మూల మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతిష్ఠాపన చేశారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బులుసు శివశంకరరావు ముఖ్యఅతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి రాజేష్‌కుమార్, కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, తమ్మన వేణుగోపాలరావు, దేవదాయశాఖ స్థపతి వలినాయగం, కమిటీ ప్రతినిధులు బాలభాస్కర్, అత్మారామ సూర్యసుబ్రమణ్యం, లక్ష్మీనారాయణ, శివశంకరన్, నారాయణన్, సుజయ్ ప్రకాశ్, శ్రీహరి, షణ్ముఖరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తిరుమలగిరి మండల ఉపాధ్యాయుల జేఏసీ సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడుతాం

బోయినపల్లి అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడుతామని, హైదరాబాద్ జిల్లా ఉపాధ్యాయుల జేఏసీ ప్రధాన కార్యదర్శి పి.రామసుబ్బారావు అన్నారు. బోయినపల్లి బాపూజీనగర్ ప్రాథమిక పాఠశాలలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో తిరుమలగిరి మండల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. రామ సుబ్బారావు, రాష్ట్ర కార్యదర్శి జి. షడక్ సభ్యుల ఆహ్వానం మేరకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సమస్యల పరిష్కారానికి ప్రణాళికలను రూపొందించారు. ఈ సందర్భంగా రామసుబ్బారావు మాట్లాడుతూ మండలంలో ఉపాధ్యాయ డిప్యుటేషన్లు అలాగే రావాల్సిన డీఏ బకాయిల గురించి చర్చించారు. షడక్ మాట్లాడుతూ పీఆర్సీ బకాయిల గురించి పాఠశాలల సమస్యలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. మండల అధ్యక్షుడుగా బి.రవికాంత్ రెడ్డి, కార్యదర్శిగా కె. హరినాథ వర్మ, కోశాధికారిగా కె. సరోజ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సీనియర్ సిటిజన్లకు వేదిక నెహ్రూనగర్ పార్క్

మారేడుపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్‌లకు మారేడుపల్లిలోని నెహ్రూనగర్ పార్క్ ఆహ్లాదకరమైన వేదికగా మారింది. నిత్యం ఉదయం, సాయంత్రం అందరూ ఒకచోట చేరి వాకింగ్, వ్యాయమం, యోగ చేసి ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటారు. అందులో భాగంగా మంగళవారం సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులు పి.వీరారెడ్డి పుట్టినరోజు వేడుకను మారేడుపల్లి సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సమక్షంలో ఆసరా డే కేర్ సెంటర్‌లో ఘనంగా జరిపారు. అసోసియేషన్ అధ్యక్షులు బి.వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి సికే నర్సింగ్ రావులు సభ్యులతో కలిసి వీరారెడ్డిని ఘనంగా సన్మానించి సత్కరించారు. జి.మహాత్మారావు, వి.సురేందర్ రెడ్డి, లియోనా డిమ్మీ, ఎం.శ్రీనివాస రావు, జి.శ్రీరామ, బి.గోపాల్ రావు, కేఎన్ చారి పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



అబ్దుల్ ముజీబ్

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టాలు దాటుతున్న వ్యక్తిని రైలు ఢీకొనగా అక్కడికక్కడే మరణించిన ఘటన జేమ్స్ స్ట్రీట్ రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం ముషీరాబాద్‌కు చెందిన అబ్దుల్ ముజీబ్‌తో పాటు తన స్నేహితుడు సోయబ్ కలిసి ఇద్దరు మంగళవారం జేమ్స్ స్ట్రీట్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా అటుగా వచ్చిన రైలు ముజీబ్‌ను ఢీకొట్టడంతో బలమైన గాయాలతో అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రైల్వేస్టేషన్‌లో అనారోగ్యంతో పడి ఉన్న ఓ వృద్ధుడిని గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ మరణించాడు. ఈ ఘటన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో 26న ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపై గుర్తుతెలియని 70 ఏళ్ల వృద్ధుడు అనారోగ్యంతో పడి ఉండగా రైల్వే పోలీసులు గమనించి వైద్యం కోసం గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా, అతడు చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడని రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం గాంధీ మార్చురీలో భద్రపరిచారు. కేసు దర్యాప్తులో ఉంది.

అప్పుల బాధతో వ్యక్తి అదృశ్యం



భరత్ (ఫైల్)

బౌద్ధనగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఓ వ్యక్తి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మెట్టుగూడలో నివసించే ఎం.భరత్(28) ర్యాపిడో డెలివరీ బాయ్. ఇతడికి భార్య వరలక్ష్మీతో పాటు ముగ్గురు పిల్లలున్నారు. భరత్ ఇటీవల కొంతమంది వద్ద అప్పులు తీసుకుని చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నాడు. 25వ తేదీన మధ్యాహ్నం 12:30కు అప్పు విషయంపై జయ అనే వ్యక్తితో మాట్లాడి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగిరాలేదు. మొబైల్‌ను ఇంట్లోనే వదిలి వేసి వెళ్లాడు. దీంతో భార్య వరలక్ష్మీ తన భర్త భరత్ కనిపించటంలేదని సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. గతంలో తన భర్త ఇంట్లో నుంచి వెళ్లిపోయి తిరిగివచ్చిన సందర్భాలున్నాయని భార్య ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అడిగింది కొండంత.. ఇచ్చింది రవ్వంత

కంటోన్మెంట్‌కు రూ.2.82 కోట్లు మాత్రమే ప్రత్యేక గ్రాంట్

సికింద్రాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గడిచిన దశాబ్దకాలంగా కంటోన్మెంట్ బోర్డు ఉన్నతాధికారులు మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనులు చేపట్టడం కూడా క్లిష్టంగా మారినందున ప్రత్యేక గ్రాంట్ ద్వారా వందకోట్ల రూపాయలు ప్రత్యేక గ్రాంటు కేటాయించాలని కేంద్రాన్ని కోరితే.. తాజాగా రూ.2.82 కోట్లు మాత్రమే ఇవ్వడం గమనార్హం. వివిధ మార్గాల ద్వారా కంటోన్మెంట్ బోర్డుకు ఏడాదికి రూ.100 కోట్లు ఆదాయం సమకూరుతోంది. అయితే ఉద్యోగులకు నెలకు రూ.8 కోట్లకు పైగా జీతాలు చెల్లించాల్సి వస్తోంది. కంటోన్మెంట్‌లోని 8 వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, ఇతర అభివృద్ధి పనులకు రూ.10 కోట్ల వరకు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. వివిధ మార్గాల్లో సమకూరుతున్న రూ.100 కోట్ల ఆదాయానికి అదనంగా ఫైనాన్స్ కమిషన్ నిధులు, ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీస్ (టీపీటీ) చార్జీలు విడుదలైతే మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనులు చేపడుతూ వస్తున్నారు. అయితే కొన్ని సంవత్సరాలుగా సర్వీసు చార్జీలు, టీపీటీ చార్జీల విడుదలలో కోత విధిస్తుండడంతో ఫిక్స్‌డ్ డిపాజిట్లను వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆర్మీ చెల్లించాల్సిన సర్వీసు చార్జీల మొత్తం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.1,152 కోట్లకు చేరుకున్నాయి. ఈ ఏడాదికి ఆర్మీ నుంచి వచ్చిన బకాయిలు 7 కోట్లు మాత్రమే. అలాగే రాష్ట్ర ప్రభుత్వం నుంచి కంటోన్మెంట్‌కు రావలసిన టీపీటీ చార్జీల బకాయిలు రూ.80 కోట్లకు చేరుకున్నాయి. కాగా నాలుగు నెలల క్రితమే కంటోన్మెంట్ బోర్డు ఖజానా నిండుకుంది. అయితే కేంద్రం నుంచి రూ.11 కోట్ల ప్రత్యేక గ్రాంట్ రావడంతో తాత్కాలికంగా ఉపశమనం లభించింది. ప్రస్తుతం పరిస్థితి మళ్లీ మొదటికొచ్చేసింది. మరలా ఖజానా ఖాళీ కావడంతో ఈ నెల మాత్రమే జీతాలు చెల్లించే పరిస్థితి ఏర్పడింది. దాంతో వచ్చే నెల జీతాలు చెల్లించడం ఎలా? అనే విషయమై బోర్డు ఉన్నతాధికారులు తర్జన భర్జనలు పడుతున్నారు.



కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం

తాజాగా రూ.2కోట్ల 82లక్షల ప్రత్యేక గ్రాంట్

కొన్ని పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం దేశంలోని కంటోన్మెంట్లకు ప్రత్యేక గ్రాంట్ విడుదల చేస్తుంది. ఈ తరహాలోనే సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు రూ.100 కోట్ల ప్రత్యేక గ్రాంట్ ఇవ్వాలంటూ 8 సంవత్సరాల క్రితమే అప్పటి సీఈఓ సుజాత గుప్తా హయాంలో కేంద్రానికి మొర పెట్టుకున్నారు. అప్పట్లో బోర్డు పాలక మండలి సమావేశంలో తీర్మానం కూడా చేసి కేంద్రానికి పంపారు. ఆ తర్వాత సీఈఓలుగా వచ్చిన చంద్రశేఖర్, అజిత్‌రెడ్డి, మధుకర్ నాయక్‌లు సైతం ప్రత్యేక గ్రాంట్ పెద్ద ఎత్తున కేటాయించాలని విన్నపాలు పంపారు. అయితే నాలుగు నెలల క్రితం రూ.11 కోట్లు రావడంతో ముందు మరింత పెద్ద మొత్తం వస్తుందని కంటోన్మెంట్ బోర్డు అధికారులు ఆశించారు. కాగా తాజాగా రూ.2కోట్ల 82లక్షలు మాత్రమే రావడంతో అధికారులు నివ్వెరపోకతప్పలేదు. కేంద్రం నుంచి దేశంలోని అన్ని కంటోన్మెంట్లకు కలిపి రూ. 304 కోట్ల 62లక్షలు విడుదల చేయగా, వీటిలో సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు రూ.2కోట్ల 82లక్షల 39వేల 726 రూపాయలు మాత్రమే వచ్చాయి. దాంతో అధికారులు ఉసూరుమంటున్నారు.

ప్రయోజనం శూన్యం



ప్రస్తుతం సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో త్రిపుల్ ఇంజిన్ సర్కారు ఉంది. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం, మల్కాజిగిరి ఎంపీగా బీజేపీ నాయకుడు, కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు బీజేపీ నాయకురాలు ఉన్నారు. మరి త్రిపుల్ ఇంజిన్ సర్కారు ఉన్నప్పటికీ ఏం ప్రయోజనం జరిగింది. కొన్ని కంటోన్మెంట్లకు 6 నుంచి రూ.25 కోట్ల వరకు ప్రత్యేక గ్రాంట్ ఇవ్వగా, దేశంలోని అన్ని కంటోన్మెంట్లలోకెల్లా పెద్దదైన సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు రూ.2కోట్ల 82లక్షలు ఇవ్వడం ఎంత వరకు సమంజసం. దీనికి స్థానిక ఎంపీ ఈటల రాజేందర్, నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మదలు బాధ్యత వహించాలి. ఈటల తక్షణమే కేంద్రంతో మాట్లాడి కనీసం రూ.20 కోట్లు కేటాయించేలా చూడాలి. ప్రజలను కించపరచేలా కేటాయింపులు కొనసాగితే అభివృద్ధి పనులు కుంటుపడతాయి. కేంద్రం ఇదే వైఖరి కొనసాగిస్తే ప్రజలతో కలిసి ఉద్యమించడానికి సిద్ధంగా ఉన్నా.

- శ్రీగణేశ్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే

అందుకే ఎక్కువ కేటాయింపు



కొన్ని కంటోన్మెంట్లకు రాబడి వనరులు తక్కువగా ఉంటాయి. ఉద్యోగులకు ప్రతి నెలా జీతాలు చెల్లించడం గగనంగా ఉంటుంది. అందుకే వాటికి అధిక కేటాయింపులు చేయాలని కేంద్రం బాగా ఆలోచించే నిర్ణయం తీసుకుంది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ అతి పెద్దది. కోట్ల రూపాయల రాబడి ఉంది. అయినప్పటికీ నాలుగు నెలల క్రితం రూ.11 కోట్ల గ్రాంట్ వచ్చింది. అప్పుడు చిన్న కంటోన్మెంట్లకు ఇవ్వలేదు. ముందు కూడా మనకు మరింత పెద్ద మొత్తం వస్తుంది.

- బాణుక నర్మద మల్లిఖార్జున్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యురాలు



జలమయంగా రహదారి

మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి వెస్ట్, ఈస్ట్ మారేడుపల్లి ప్రధాన రహదారులు వరద నీటితో జలమయమయ్యాయి. వాహనదారులు, ప్రయాణికులు, పాదచారులు, తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

- మారేడుపల్లి, ఆంధ్రజ్యోతి

గుంతలు పూడ్చండి



క్రైస్తవ శ్మశాన వాటిక వద్ద రోడ్డుపై గుంతలు

చిలకలగూడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మెట్టుగూడ, ఆలుగడ్డ బావి, క్రైస్తవ శ్మశాన వాటిక చౌరస్తా వద్ద ఏర్పడిన గుంతలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చిన్నపాటి వర్షానికి గుంతలో నీరు నిలిచి వాహనాలు గుంటల్లో పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు వెంటనే గుంతలు పూడ్చి సమస్య పరిష్కరించాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

నివాళులు

మారేడుపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి హరీష్‌రావు తండ్రి సత్యనారాయణ మృతికి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సంతాపం తెలియజేశారు. కోకాపేటలోని సత్యనారాయణ నివాసంలో ఆయన పార్థివదేహంపై తలసాని పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రెగ్యులర్ వైద్య పరీక్షలతో ఆరోగ్యం



డాక్టర్ ప్రమోద్ కుమార్

రెజిమెంటల్‌బజార్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గుండె శస్త్ర చికిత్సల అనంతరం రెగ్యులర్‌గా వైద్య పరీక్షలు చేసుకోవడం వల్ల ఆరోగ్యవంతమైన జీవనం గడపవచ్చని మెడికవర్ ఆస్పత్రి సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డాక్టర్ ప్రమోద్ కుమార్ కుచ్చులకంటి అన్నారు. తాను రోగులపై చేసిన ఫాలోఅప్ రీసెర్చ్ 'వరల్డ్ జర్నల్ ఆఫ్ కార్డియో వాస్కులర్ డిసీజ్'లో ప్రచురితం అయిన సందర్భంగా మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 20 సంవత్సరాలుగా శస్త్ర చికిత్సల అనంతరం 3070 మంది రోగులను ఎంపిక చేసి వారి ఆరోగ్యం, జీవనశైలిపై రెగ్యులర్‌గా ఫాలోఅప్ చేసి అరుదైన రికార్డు సాధించినట్లు తెలిపారు. ఇది ప్రపంచవ్యాప్తంగా ఒకే వైద్యుడి ఆధ్వర్యంలో నిర్వహించిన అతిపెద్ద ఫాలోఅప్ అధ్యయనాల్లో ఒకటిగా నిలిచిందని అన్నారు. రోగులను నిరంతరంగా పర్యవేక్షించడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరచవచ్చని గుర్తించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 20 వేలకు పైగా పీటీసీఏ(స్టెంట్)శస్త్ర చికిత్సలను చేసినట్లు తెలిపారు.

వేతన సంఘం ఏర్పాటుపై హర్షం

చిలకలగూడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీత, భత్యాల పెంపుకు 8వ వేతన సంఘం ఏర్పాటుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలపడంతో సికింద్రాబాద్‌లోని రైల్వే కార్యాలయాలు, ఉద్యోగ సంఘాలు, పెన్షనర్స్ అసోసియేషన్లు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. జీత భత్యాల సవరణకు 10 సంవత్సరాలకు ఒకసారి వేతన సంఘం ఏర్పాటు చేస్తారు. 7వ పే కమిషన్ అమలు 2016 జనవరి 1 నుంచి అమలు చేయగా, 8వ వేతన సంఘం అమలు 2026 జనవరి 1 నుంచి అమలు కావాల్సి ఉంది. కనీస వేతనం రూ.54000, ఉద్యోగులందరికి పాత పెన్షన్ అమలు, స్తంభింప చేసిన బకాయిల విడుదల, మెరుగైన జీతభత్యాలు, నిర్ణయించిన సమయానికి పే- కమిషన్ అమలు, రైల్వే ఆరోగ్య కార్డు(యూఎంఐడీ) దేశంలోని ఏ ఆస్పత్రిలోనైనా అమలయ్యేలా చర్యలు చేపట్టాలని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వే మెన్, దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య, పెన్షనర్స్ అసోసియేషన్ ఆఫ్ రైల్వేస్ ప్రధాన కార్యదర్శి ఎస్.ఎన్.సీ. రామకృష్ణాచార్యులు డిమాండ్ చేస్తున్నారు. రైల్వే ఉద్యోగులువేతన సంఘం ఏర్పాటుపై ఆనందం వ్యక్తం చేస్తూ ఎంతమేరకు జీత భత్యాలు పెరుగుతాయోనని లెక్కలు వేసుకుంటున్నారు.



తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

రీల్స్, ఆన్‌లైన్ గేమ్స్‌కు దూరంగా ఉండాలి : ఏసీపీ

అడ్డగుట్ట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ గేమ్‌లు, రీల్స్‌లకు విద్యార్థులు దూరంగా ఉండాలని గోపాలపురం ఏసీపీ సుబ్బయ్య, తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి సూచించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాల సందర్భంగా మంగళవారం అడ్డగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు తుకారాంగేట్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. సీఐ మాట్లాడుతూ పోలీస్ అనేది ప్రజల రక్షణ కోసం పనిచేసే వ్యక్తి అని అన్నారు. ఈ మధ్య కాలంలో ఎక్కడ చూసిన ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడుతున్న విద్యార్థుల్లో మార్పు తెచ్చేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ సీఐ శ్రీకాంత్ రెడ్డి, ఎస్సై కిరణ్ కుమార్‌లతో పాటు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్సై శ్రీధర్

సెల్‌ఫోన్, డ్రంకెన్ డ్రైవ్ చేయొద్దు

రెజిమెంటల్‌బజార్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ డ్రైవింగ్, డ్రంకన్ డ్రైవ్ చేయడం వల్ల ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని గోపాలపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ అన్నారు. ఇలాంటి డ్రైవ్‌ల్లో పట్టుబడిన 80 మంది వాహనదారులు కౌన్సెలింగ్, కోర్టులో హాజరై వాహనాలు తీసుకోవడానికి పోలీస్ స్టేషన్‌కు వచ్చిన వారితో ఇన్‌స్పెక్టర్ మాట్లాడారు. ఇలాంటివి మరలా పునరావృతం కాకుండా నడుచుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేసిన వారికి రూ.1100, డ్రంకన్ డ్రైవ్ చేస్తున్న వారికి రూ.2100 చొప్పున జరిమానా విధించారు. ఎస్సైలు శ్రీధర్, బసు, అంజయ్య, నజీముద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీలు



విద్యార్థులతో ఏసీపీ రమేష్, ఇన్‌స్పెక్టర్ నాగరాజు

తిరుమలగిరి అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా తిరుమలగిరి పోలీసులు లాల్‌బజార్‌లోని పల్లవి మోడల్‌స్కూల్‌లో విద్యార్థులకు డ్రగ్స్‌పై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. తిరుమలగిరి డివిజన్ ఏసీపీ రమేష్, తిరుమలగిరి పోలీస్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు వ్యాస రచన పోటీలను తిలకించారు. పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఎస్సైలు మహేష్, కరుణాకర్, మనోజ్, మహిళా ఎస్సై ఆంతోనియమ్మ, ప్రిన్సిపాల్ శివమోహన పాల్గొన్నారు.